క్లుప్తంగా

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణమంటున్న బాలిక తల్లిదండ్రులు
- తమకు న్యాయం చేయాలని వేడుకోలు

కన్నాయిగూడెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలిక కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని హాస్టల్‌లో ఇంటర్ చదువుతున్న బాలిక ఫిబ్రవరి 14న ఉదయం తనకు ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ సిబ్బందికి చెప్పి ఇంటికి బయల్దేరింది. మార్గమధ్యలో అదే మండలానికి చెందిన ఓ గ్రామ యువకుడితో కలిసి తిరిగినట్లు బాధితులు ఆరోపించారు. ఆరోజు సాయంత్రం ఇంటి కొచ్చి ఎవరూ లేని సమయంలో రహస్య ప్రదేశంలో ఉరేసుకుని మృతి చెందినట్లు బాధితులు చెబుతున్నారు. ఆవ్యక్తే తన కుమార్తెకు మాయమాటలు చెప్పి మోసం చేశాడని, మృతికి కారణమయ్యాడని అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధిత బాలిక తల్లిదండ్రులు కోరారు. తమ పర్మిషన్ లేకుండా తమ కూతుర్ని బయటకు పంపిన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు కోరారు. ఇదే విషయమై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సురేశ్ వెల్లడించారు.

ఫిట్స్‌తో కానిస్టేబుల్ మృతి


మృతి చెందిన చంద్రయ్య

మంగపేట: ఫిట్స్‌తో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలో బ్రాహ్మణపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లికి చెందిన గొప్ప చంద్రయ్య(53) మంగపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వరంగల్‌లో ఫైర్ ట్రైనింగ్‌కు వెళ్లిన ఆయన బుధవారం ఆర్టీసీ బస్సులో ఇంటికి వస్తుండగా ఫిట్స్ రావడంతో ములుగు ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో వైద్యం పొందిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జీలో ఉన్నారు. కాగా, తెల్లవారు జామున సుమారు 3.45 గంటల ప్రాంతంలో మరోసారి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు తిరిగి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యం పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని మధ్యాహ్నం బ్రాహ్మణపల్లికి తీసుకురాగా ఏటూరునాగారం సీఐ రాజు, మంగపేట ఎస్సై ఎండీ తాహెరబాబా నివాళులర్పించారు. దహన సంస్కార ఖర్చులకు తక్షణ సాయంగా రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడికి భార్య రమ, కుమారుడు సాయికృష్ణ ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి క్రాస్‌వద్ద గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మోరంచపల్లి క్రాస్‌వద్ద ఎక్సైజ్ అధికారులు రూట్‌వాచ్ చేస్తున్న క్రమంలో కొంపెల్లి గ్రామానికి చెందిన పాల్తీయరాజు, గొర్లవీడు గ్రామానికి చెందిన గుగులోతు సాగర్‌లు గూడ్స్ వాహనంలో 20 లీటర్ల సారాయిని తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుడుంబా స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించినట్లు వెల్లడించారు.

10 లీటర్ల గుడుంబా..

టేకుమట్ల మండలంలోని రాఘవపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రూట్ వాచ్ చేస్తున్న క్రమంలో రాఘవపూర్ గ్రామానికి చెందిన రాజునాయక్ ద్విచక్రవాహనంపై 10 లీటర్ల గుడుంబాను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గుడుంబాను స్వాధీనం చేసుకుని రాజునాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రూట్‌వాచ్‌లో ఎస్సై మాన్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

డాక్టర్లు ఉన్నట్టా.. లేనట్టా?

- పీహెచ్‌సీలో అందుబాటులో ఉండని వైద్యులు!
- ఇబ్బందులు పడుతున్న రోగులు


డాక్టర్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

కన్నాయిగూడెం: జిల్లాలోని మారుముల మండలమైన కన్నాయిగూడెంలో ఎక్కువగా నిరుపేదలు నివసిస్తుంటారు. ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు వచ్చిన తొందరగా బయటకి పోలేని పరిస్థితి. మండలంలోని పీహెచ్‌సీనే ఆశ్రయించక తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మండలానికి ఇద్దరు డాక్టర్లను నియమించింది. కాని ఆస్పత్రిలో వైద్యులు సమయానికి లేకపోడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అసలు ఆస్పత్రిలో డాక్టర్లు ఉన్నారా లేరా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడు ఆస్పత్రికి వెళ్లిన వైద్యులు అందుబాటులో ఉడటం లేదని, విధులకు ఎప్పుడు వస్తున్నారో తెలియడం లేదని రోగులు వాపోతున్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని తెలుపుతున్నారు. కాగా వైద్యులు అందుబాటులో లేక సరైన సమయంలో వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కూడా కోల్పోయినట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు విధులకు రాకుండా ఉన్నతధికారులకు మాత్రం విధుల్లో ఉన్నట్లు ఫొటోలు చూపుతున్నట్లు సమాచారం. కాగా, గురువారం వైద్యశాలలో వైద్యులు లేకపోడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అక్కడ ఉన్న సిబ్బందిని సమాచారం అడగగా తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఇప్పటికైన డాక్టర్లు విధులకు వచ్చేవిధంగా చూడాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



కన్నాయిగూడెం పీహెచ్‌సీ వైద్యులకు గురువారం ఎలాంటి సెలవు ఇవ్వలేదు. డ్యూటీకి వచ్చినట్లు తమకు ఫొటోలు కూడా పెట్టారు. వారు ఆస్పత్రికి రాలేదని తేలితే చర్యలు తీసుకుంటాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందేవిధంగా చూస్తాం.

– అప్పయ్య, డీఎంహెచ్ఓ

బాలల హక్కుల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ సతీష్‌కుమార్

వెంకటాపురం(కె): బాలల హక్కుల పరిక్షణకు మండలంలో అన్ని శాఖల అధికారులు, బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ భవన్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, కార్యదర్శిగా ఎంపీడీఓ అడ్డూరి బాబు, కన్వీనర్‌గా సీడీపీఓ అడ్డూరి బాబు, సభ్యులుగా ఎంఈఓ వెంకటేశ్వరావు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. బాలల హక్కులకు ఉల్లంఘనకు గురి కాకుండా చూడాలని అన్నారు. బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు బాల్యా వివాహాలు జరగకుండా చూడాలని అన్నారు. బడి ఈడు పిల్లాలను బడిలో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శిరీష, బాలల పరిరక్షణ విభాగం అధికారి హరికృష్ణ, ఎంపీఓ హనుమంతరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవతి తదితరులు ఉన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని తాడ్వాయి ట్రాన్స్‌కో ఏఈ వేణుకుమార్ గురువారం ఒక ప్రకనటనలో సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లు వాడటం వలన సాగునీటి వృథాతో పాటు విద్యుత్ ఖర్చు అవుతుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఆటో స్టాటర్లను తొలగించాలన్నారు. నిరంతరంగా అవసరం లేకున్నా నీటిని వినియోగించినట్లయితే మార్చి నెలలో నీటి నిల్వలు తగ్గి పంటలకు సాగు నీరు అందక ఎండిపోతాయన్నారు. అంతేకాకుండా బోరు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని దాని వలన మోటార్లు కాలిపోకుండా ఉంటాయని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


కిట్‌ను అందజేస్తున్న హెచ్‌డబ్ల్యూఓ శ్రీలత

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలలోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరయల్‌ను ప్రధానోపాధ్యాయురాలు రేవతి, హెచ్‌డబ్ల్యూఓ శ్రీలత గురువారం పంపిణీ చేశారు. రాబోయే టెన్త్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని అన్నారు. ఐటీడీఏ ద్వారా పీఓ అంకిత్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వాచ్, క్యాలికిలేటర్, ఆల్‌ఇన్‌వన్‌బుక్స్, పెన్స్, మ్యాప్ వస్తువులను కూడిన కిట్‌లను అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలి


దుంపిల్లగూడెంలో విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న దేవ్‌సింగ్

ములుగు రూరల్(గోవిందరావుపేట): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్యా దేవ్‌సింగ్ అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలంలోని దుంపిల్లగూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు స్టడి మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి 10 జీపీఏ సాధించాలని అన్నారు. విద్యార్థులు తల్లితండ్రుల, పాఠశాల పేరు నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కాంతారావు, ఉపాధ్యాయులు, సామాజిక వేత్త విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంగపేట: వినయంతో కూడిన విద్య విజయానికి దోహద పడుతుందని భూక్యా దేవ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుకుంటున్న విద్యర్థులకు నేషనల్ ఎలిజిబిలిటీ, ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) ఎంసెట్ స్టడీ మెటీరియల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య అధ్యక్షతన దేవ్‌సింగ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్ష, ఎంసెట్‌లో అర్హత సాధించేందుకు సన్నద్ధం అవతున్న విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగితే అనుకున్నది తప్పక సాదిస్తారన్నారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నివారిద్దాం అనే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పాయం రమణ

వెంకటాపురం(కె): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద క్రీడా మైదానంలో సమ్మక్క–సారక్క సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటాపురం, వాజేడు రెండు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడ పోటీలతో వ్యక్తిలో దాగి ఉన్న నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. క్రీడలు శారీరక ధారుఢ్యానికి దోహదపడుతాయని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20,116, రెండవ బహుమతి రూ.15,116, మూడవ బహుమతి రూ.10,116తో పాటు షీల్డులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు పసుల సూర్యనారాయణ, పర్శిక సతీష్, రాంబాబు, హరినాథ్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండల కేంద్రంలోని జీసీసీ గోదాం సమీపంలో ఉపాధిహామీ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, కార్యదర్శి శెట్టి మురళి, నాయకులు బాలసాని వేణు, ఆలసాని మధు గాందర్ల నాగేశ్వరావుజాగర శాంతమూర్తి, వేల్పూరి లక్ష్మినారాయణతో పాటు తదితరులు ఉన్నారు.

జేఏసీ కమిటీ ఎన్నిక


జేఏసీ నూతన కమిటీ సభ్యులు

ములుగు రూరల్: ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా కమిటీని జిల్లా కేంద్రంలో గురువారం ఎన్నుకున్నారు. జేఏసీ కన్వీనర్‌గా మడుగురి నాగేశ్వర్‌రావు, గౌరవ సలహాదారుడిగా పోదెం కృష్ణప్రసాద్, జాయింట్ కన్వీనర్‌గా ఏళ్ల మధుసూదన్, కో కన్వీనర్‌లుగా గుల్లగట్టు సంజీవ, హట్కర్ సమ్మయ్య, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి, జనగాం బాబురావు, మంకిడి రవి, కొర్ర రాజన్న, పాడియా కుమార్, పాషా, మీడియా ఇన్‌చార్జ్‌గా అన్వరం రవికాంత్, ఆర్థిక కార్యదర్శిగా శిరుప సతీష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిర్మాణి, శ్రీనివాస్‌రెడ్డి, వినాయక్, లక్ష్మినారాయణ, దశరథ్, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

మంగపేట: మండలంలోని మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. హెచ్‌ఎంగా ఎస్.నవీన, కలెక్టర్‌గా బి.శివనాగలక్ష్మి, డీఈఓగా ఎం.స్పందన, ఎంఈఓగా ఎస్.నవీన్, ఉపాధ్యాయులుగా డి.లక్ష్మీప్రసన్న, హుమేరా, దీపిక, సాహితి, రిహానా, జ్యోతిక వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం చందా భద్రయ్య, మేనక, నర్సింహా, రాంబాబు, వీరనారాయణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారయ్య, వెంకట్, కృష్ణవేణి, అనసూర్య, అబ్బు సత్యనారాయణ, జమీల్, అంజలి, సురేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే నియోజకవర్గ అభివృద్ధి


మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మల్హర్: బీజేపీతోనే మంథని నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 8వ రోజు మండలంలోని నాచారం, అన్నారం‌పల్లి, రుద్రారం, శభాష్‌నగర్, ఎడ్లపల్లి, కొండంపేట, కొయ్యూరు గ్రామాల్లో సునీల్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.లక్షల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్ని ఎకరాలకు పంటకు నీళ్లు ఇచ్చారని తెలుపలన్నారు. ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు ఎం లాభం చేశారని ప్రశ్నించారు. ఎంపీ సోయం బాబురావు కాటారం మండలంలో పోడు భూముల సమస్యలపై సభ పెడితే ప్రభుత్వంలో చలనం వచ్చి పోడు పట్టాలపై అధికారులతో హడావిడి చేసి, ఇప్పుడు పోడు భూముల ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. పక్క రాష్ట్రంలో బీజేపీ లక్షల ఎకరాలకు పట్టాలు ఇస్తే మన రాష్ట్రంలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి, వెన్నంపల్లి పాపన్న ఉన్నారు.

బస్టాండ్ స్థలంపై పార్టీల వైఖరి తెలపాలి

కాటారం: మండల కేంద్రంలోని మహదేవపూర్ వైపు వివాదస్పదంగా మారిన ఆర్టీసీ బస్టాండ్ స్థలంపై రాజకీయ పార్టీలు వారి వైఖరి స్పష్టం చేయాలని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుగుల రాజన్న డిమాండ్ చేశారు. స్థలం వద్ద గురువారం ఆర్టీసీకి బీఎస్పీ నాయకులు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బొప్పారానికి చెందిన దాతలు భూమిని ఆర్టీసీ విరాళంగా ఇవ్వడం జరిగిందని, కానీ పలు కారణాలతో దాత వారసులు ఇప్పుడు భూమిని స్వాధీనపర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఓట్ల రాజకీయాలు చేయడం మానుకొని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేవాటిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కాటారం బస్టాండ్ అంశంలో రాజకీయ పార్టీల నాయకులు ఎందుకు మౌనంగా ఉంటున్నారో చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేశ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, బీర్నెల్లి మహేశ్ ఉన్నారు.

యాసంగి పత్తితో రైతులకు మేలు


పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

టేకుమట్ల: యాసంగి పత్తితో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వెల్లంపల్లిలో యాసంగి పత్తి పంటలను ఏఓ పరిశీలించి మాట్లాడారు. యాసంగి పత్తి పంట వల్ల ఎక్కువ లాభం వస్తుందని అన్నారు. ఈ పంటను డిసెంబర్ మాసంలో విత్తుతే మార్చి వరకు చేతికి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం యాసంగిలో వేసిన మొక్కజొన్న పంటకు పొటాష్ లోపం ఏర్పడుతుందని, కావున పంటల్లో పొటాష్ నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి అభినయ్, రైతులు ఉన్నారు.

20న మెగా జాబ్‌మేళా


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్హర్: పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న మంథనిలోని శ్రీలక్ష్మి భార్గవి ఫంక్షన్ హాల్(గంగారం)లో మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి తెలిపారు. మెగా జాబ్ మేళా పోస్టర్‌ను మండల కేంద్రం తాడిచర్లలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, రైతుబంధు మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, మండల నాయకులు కోట రవి, వాల యాదగిరిరావు, మండల అధికార ప్రతినిధి బండి రాజయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవర్నేని రాజేశ్వర్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ మల్క రాజేశ్వర్‌రావు, బీసీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఎస్ఎస్ తాడ్వాయి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


ములుగు రూరల్: పరామర్శిస్తున్న తస్లీమా


మంగపేట: పరామర్శిస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని వీరపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నాలి జయమ్మ రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సీతక్క గురువారం పరామర్శించారు. మృత దేహం వద్ద నివాళులర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన గుమ్మడి బుచ్చమ్మ మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. బొల్లు దేవేందర్, ముజఫర్‌హుస్సెన్, సర్పంచ్‌లు ఇర్ప సునీల్, మంకిడి నర్సింహాస్వామి, అశ్విని, లచ్చుపటేల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడి సతీష్, మోహన్‌రావు, పల్నాటి సత్యం, మేడిశెట్టి ఆనందం, పులి రవి గంట సాయిరెడ్డి, లంజపెల్లి నర్సయ్య, ముక్తి రామస్వామి పాల్గొన్నారు.

ములుగు రూరల్: గోవిందరావుపేట మండల కేంద్రంలోని కొండవీటి కోటేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. నాయకులు పాలడుగు వెంకట కృష్ణ, పెండెం శ్రీకాంత్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట మండలం మొద్దులగూడెంలో..

గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన దార్ల సాంబశివరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ గురువారం పరామర్శించారు. సర్వర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన జాతీయ స్థాయి యోగా క్రీడాకారుడు పోరనందుల ప్రమోద్ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన నాగ శ్రీను అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. మాజీ ఉపసర్పంచ్ మంచర్ల వెంకటేశ్వర్లు క్వింటా బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌళం వెంకటేశ్వర్లు, కోడం బాలకృష్ణ, పయ్యావుల నర్సింహారావు, చదలవాడ వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, బొనుగు సుబ్బారావు, సాంబశివరావు, శ్రీను, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు’

చిట్యాల: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని చైన్‌పాక, అందుకుతండా, ఒంటిప్పతండా, వెంచరామి కుర్మపల్లి గ్రామాల్లో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు యాత్ర కరపత్రాలను అందజేసి మాట్లాడారు. పేదల అకౌంట్లో డబ్బులు జమ చేస్తామని కేంద్ర ప్రభుత్వం భ్రమపెట్టి పేదలకు మొండి చెయ్యి చూపించి ధనికులకు మాత్రం రుణాలు మాఫీ చేసిందని ఆరోపించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని బీఆర్ఎస్‌పార్టీ అధినేత కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చేసిన మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకల రాయకొమురు, కాసం రాజిరెడ్డి, దబ్బెట అనిల్, సది, మురళి, స్వామి, శివ ఉన్నారు.